అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 31 అక్టోబర్ 2025 పేజీలు : 04





# అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి..!

-సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
-ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
-ఉరవకొండలో 'ఇంటింటికి మంత్రి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజలతో మమేకమైన మంత్రి


గజమాలతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్



'మన డబ్బులు-మన లెక్కలు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

ఉరవకొండ, అక్టోబర్ 30 ప్రభాతవార్త

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అప్పుడే మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేయడానికి వీలుంటుందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో గురువారం ఆయన 'ఇంటింటికీ మంత్రి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి బోయ వీధి, లాలుస్వామి గుడి, పాత బజారు, కామన్నకట్ట, కొండప్పబావి వీధి, మూగబసవన్నకట్ట తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఇళ్లకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. తొలుత మంత్రి పట్టణానికి చేరుకోగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకువద్ద పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికి పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించినందుకుగాను క్రేన్ ద్వారా గజమాలతో ఘనంగా సన్మానించారు. స్థానిక మల్లేశ్వరస్వామి, సాక్షి గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గుంతకల్లు రోడ్డు నుంచి కణేకల్లు రోడ్డువరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు కారణంగా తాము ఇళ్లను కోల్పోవాల్సి వస్తోందని కొందరు మంత్రి దృష్టికి తీసుకురాగా పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని రోడ్డు నిర్మాణంవల్ల నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణంలో తాగునీటి సరఫరా ఎలా కొనసాగుతోందని మంత్రి మహిళలను ఆరా తీయగా మీ కృషి కారణంగా సంవృద్ధిగా నీళ్లు వస్తున్నాయని చెప్పగా స్పందించిన మంత్రి మంచి నాయకుని ఎన్నుకుంటే అభివృద్ధి జరుగుతుందనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నామని చెప్పారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 'మన డబ్బులు-మన లెక్కలు' కార్యక్రమం కింద మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కింద 240 కోట్ల రూపాయలకు రుణ ప్రణాళిక తయారు చేయడం జరిగిందని బ్యాంకు రుణాలు 178 కోట్లు, 60 కోట్లు స్త్రీనిధి రుణాల ద్వారా మహిళల జీవనోపాదులను మెరుగుపర్చడానికి విరివిగా రుణాలు అందజేసి వారి ఆదాయాభివృద్ధికి దోహద పడటం జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ శైలజ వివరించగా కార్యక్రమంపై మహిళా సంఘాల మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివాదాస్పద మైనింగ్ లీజుల్లో అధికారుల పరిశీలన

- సుప్రీంకోర్టుచే 6 మంది సభ్యులతో బృందం ఏర్పాటు


చిత్రపటాలను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ కన్జర్వేటర్


మైనింగ్ లీజ్ ప్రాంతాల్లో సిబ్బందితో వివరాలు సేకరిస్తున్న డిఎఫ్ఓ


విలేకరులతో మాట్లాడుతున్న డిఎఫ్ఓ

డి.హిరెహాళ్, అక్టోబర్ 30 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలంలోని వివాదాస్పద ఇనుపగనుల్లోని లీజ్ ప్రాంతాలను మూడు శాఖల అధికారులు సందర్శించి పరిశీలించారు. గురువారం డి.హిరెహాళ్ మండల పరిధిలోని బళ్ళారి రిజర్వ్ ఫారెస్ట్ చిత్రపటాలను పరిశీలించి వాటి ఆధారంగా ఆయా మైనింగ్ లీజు ప్రాంతాల్లో పరిశీలనచేసి సరిహద్దు రాళ్ళను గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఇరు రాష్ట్రాల పరిధిలోని ఇనుపగనుల లీజుల సరిహద్దుల్లో చోటు చేసుకున్న వివాదాస్పద సరిహద్దు రాళ్లను పరిశీలించి సర్వే అనంతరం నివేదికలను సుప్రీం కోర్టుకు నివేదించాల్సి ఉంది. శుక్రవారం నుండి సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ డైరెక్టర్, గనులు భూగర్భ శాఖ, అటవీ శాఖల ఆధ్వర్యంలో నవంబర్ 10 వరకు సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్ల వివాదంపై పూర్తిస్థాయిలో నివేదికలను సర్వ బృందం తయారు చేయాల్సి ఉంది. సర్వేకు సుప్రీంకోర్టు కమిటీని నియమించింది.. డీఎఫ్ఓ ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ఎస్ఎల్పి 73667367 ప్రకారం సుప్రీంకోర్టు కమిటీ నియమించిందని సోషల్ ఫారెస్ట్ కంజర్వేటర్ గురుప్రభాకర్ పేర్కొన్నారు. డిఎఫ్ఓ విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జ్ సుధాంషుదునియా చైర్మన్గా ఆరు మంది సభ్యులతోటి ఒక కమిటీ నియమించడం జరిగిందని మైనింగ్ ప్రాంతంలో మైనింగ్ లీజు యజమానులు తవ్విన ప్రాంతాలను పరిశీలించి బౌండరీలు నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. సర్వే అనంతరం మైనింగ్ ప్రాంతాల సరిహద్దుల్లోని బౌండరీలకు సంబంధించిన ఆ నివేదికలను సుప్రీంకోర్టుకు నివేదించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేకు సంబంధించి అక్టోబర్ 23న న్యూఢిల్లీలో ఒకసారి సమావేశం జరిగిందని ఆ తర్వాత నవంబర్ 26న రెండవ సమావేశం అనంతపురంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో నిర్ణయించిన అంశం మేరకు మైన్స్ అండ్ జియాలజీ డిపార్ట్మెంట్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్ డిపార్ట్మెంట్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఈ మూడు శాఖల డిపార్ట్మెంట్స్ తో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ సర్వే లో భాగంగా లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగించి ఇప్పుడు మైనింగ్ ఏరియాలో ని అన్ని ప్రాంతాలను సరిహద్దుల వివాదంకు సంబంధించిన బౌండరీల సర్వేను రేపటి నుంచి ప్రారంభించి నవంబర్ 10 నాటికి పూర్తి చేస్తామన్నారు. సర్వే పూర్తి అయిన అనంతరం ఆరు మంది సభ్యుల బృందం నివేదికలను తయారుచేసి మూడు నెలలుగా సుప్రీంకోర్టుకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# టిటిడి రాజకీయ పునరావాస కేంద్రంగా మారనీయం

- తుఫాను బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తాయి - బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్


విలేకర్లతో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని గజమాలతో సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

అనంతపురం సిటీ, అక్టోబర్ 30 ప్రభాతవార్త

ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన టిటిడిని కొందరు స్వార్థం కోసం రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చు కుంటున్నారని దానిని నియంత్రించే దిశగా బిజెపి ప్రయత్నిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిటిడిని గత ప్రభుత్వ పాలనలో అనేక అరాచకాలతోపాటు పవిత్రతను భంగం కలిగించే విధంగా వ్యవహరించారని, వాటిపై విచారణ కొనసాగుతోందని తప్పు ఎవరు చేసినా చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల పవిత్రతను కాపాడేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. మొంథా తుఫాను ముందస్తు చర్యల వల్ల నష్ట ప్రభావం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కలిసి కట్టుగా బాధితులకు అండగా నిలుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా అనకాపల్లి, రాజమండ్రి, నర్సాపురం, మచిలీపట్నం ప్రాంతాల్లో భారీ వర్షాలు పడటం వల్ల రైతులకు పెద్ద ఎత్తున నష్టం చేకూరిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారని రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రభలకుండా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. దీంతోపాటు మత్స్యకారులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు రూ.3500 కోట్లు ఆర్థిక సాయం అందిస్తున్నారని దీని వల్ల వారికి కొంత వెసులుబాటు లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య యోజన పథకాన్ని రాష్ట్రంలో పూర్తిగా అమలయ్యేలా చూసి నష్టపోయిన పడవలకు ఇన్సురెన్స్ తోపాటు కనీస వేతనం పథకం ద్వారా అందేలా చూస్తున్నామన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో వైసిపి సాయం చేయకపోగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను మైనార్టీ నేత మహ్మద్ రఫి ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించారు. అదే విధంగా భాస్కర్‌రెడ్డి, విష్ణుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది యువకులు మాధవ్ సమక్షంలో బిజెపిలో చేరారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, ఆంజినేయులు, రత్నమయ్య, లలిత్‌కుమార్, రామాంజినేయులు, సీనియర్ నేత అంకాల రెడ్డి, మైనార్టీ నేత మహ్మద్ రఫితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# 17 పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ రూ.12.46 కోట్లు మంజూరు

- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్


సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబరు 30, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన రాయితీలను సమీక్షించి పెట్టుబడి రాయితీ కింద 17 పరిశ్రమలకు గాను రూ. 12.46 కోట్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ తెలియజేశారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపన సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులకు చేసుకున్న దరఖాస్తులను సమీక్షించారు. నిర్ణీత కాల వ్యవధిలోగా అనుమతులను సత్వర మంజూరు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. అలాగే ఐడిపి పాలసీ పథకం కింద అమ్మకం పన్ను రాయితీ రూ.1.10 కోట్లు, టెక్స్టైల్ పాలసీ పథకం ద్వారా వడ్డీ రాయితీ పథకం ద్వారా రూ.16.18 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమల స్థాపనకు అధికారులు సమన్వయంగా కృషి చేయాలని సూచించారు. వచ్చే నవంబరు 14, 15 తేదీలలో విశాఖ పట్టణంలో జరిగే "పార్ట్నర్షిప్ సమ్మిట్"కు సంబంధించిన అవగాహన ఒప్పందాలు భూమి పూజలు పరిశ్రమల ప్రారంభోత్సవాల గురించి సమీక్షించారు. జిల్లా నుంచి పార్ట్నర్షిప్ సమ్మిట్‌కు హాజరై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఐదు పరిశ్రమలు, అలాగే భూమి పూజకు సిద్ధంగా ఉన్న ఏడు పరిశ్రమల గురించి సమీక్షించారు. ఏపీఐఐసీ కి సంబంధించిన పరిశ్రమల ప్రగతిని మరియు వాటికి సంబంధించిన అంశాల గురించి కూడా సమావేశంలో చర్చించారు. హిందూపురం నందు గ్రీన్ కో కంపెనీ వారు నిరుద్యోగులకు సోలార్ ల్యాబ్ ట్రైనింగ్ కు సంబంధించిన పరికరాలు ఇన్స్టాల్ చేయడానికి ఆమోదం తెలిపారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజరు జె నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సమత, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ సంపత్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, డిఆర్డిఏ పిడి నరసయ్య, ఎల్ డి ఎం రమణ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి విగ్రహావిష్కరణ

- ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పార్లమెంట్ సభ్యులు బి.కే.పార్థసారథి అంబిక లక్ష్మీనారాయణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన వాల్మీకులు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎం.పి.లు బీకే పార్థసారథి అంబికా లక్ష్మినారాయణ.


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపి బికే పార్థసారథి

రొద్దం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహావిష్కరణ పెద్దమంతూరు పంచాయతీ రొప్పాల గ్రామంలో వాల్మీకి కులస్తుల ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బి.కె పార్థసారథి అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ వైసీపీ మాజీ మంత్రులు శంకర్ నారాయణ ఉషశ్రీ చరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అందరూ కలిసికట్టుగా పోరాడితే మన హక్కులు సాధించుకున్న వాళ్ళం అవుతామని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో వాల్మీకులకు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నామని గల్లి నుండి ఢిల్లీ వరకు మన హక్కులను తెలియజేసే విధంగా మనకు పార్లమెంట్ సభ్యులు ఉన్నందుకు మనం గర్వపడాలని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నరహరి కార్యక్రమం ఉద్దేశించి తెలియజేయడం జరిగింది మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని మీరు కూడా ఎవరైతే వాల్మీకులకు అన్ని రంగాల్లో చేదోడువాదులుగా ఉంటారో వారిని మర్చిపోకూడదని ఎస్టీ జాబితాలో రిజర్వేషన్ పొందెందుకు మా సర్వశక్తులకు కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా వాల్మీకులు గ్రామ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించాలి..!

ప్రతి గ్రామానికి,ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత అదేశం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత,సమావేశంలో పాల్గొన్న మండల అధికారులు,టిడిపి నాయకులు

ఆత్మకూరు అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండలంలో గల ప్రతి గ్రామానికి.ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు.గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సచివాలయ కార్యాలయంలో మండల స్థాయి అధికారలతో ఎమ్మెల్యే పరిటాల సునీత సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చిండం జరిగింది.ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే సంకల్పంతో 90 కోట్ల నిధులతో చేప్పడుతున్న పనుల పురోగతిపై ఎమ్మెల్యే ఆరా దీశారు.వీలైనంత తక్కువ కాలంలో పనులు పూర్తి చేయాని,గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చూడాలని అధికారులను అదేశించారు.ఇల్లు లేని ప్రతి ఒక్కరూ ఇంటికి కోసం దరఖాస్తు చేసుకోవాలని,ఇంటి నిర్మాణానికి అయ్యే మొత్తాన్ని కూడా పెంచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు.తహాశీల్దార్లు లబ్ధిదాలరకు ఆన్లైన్‌లో పొజిషన్ సర్టిఫికెట్లును త్వరగా వచ్చేలా చూడాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.హంద్రీ-నీవా,పీఏబిఆర్ కాలువలు మండలంలో ప్రవహిస్తున్నందున రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలుతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారని,రైతులకు సకాలంలో విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేసి మెరుగైన విద్యుత్‌ను అందించాలని, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సబ్సిడీలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని చెరువుకు నీరుతో నింపి సాగునీరు రైతులకు అందిస్తామన్నారు. కొంతమంది అధికారులు సరైన వివరాలుతో సమావేశానికి రాకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తంచేశారు.మరోసారి ఇలాంటివి పునరావృతం కాకూడదని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.

ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ లక్ష్మినాయక్,ఎంపిడిఓ లక్ష్మినరసింహ, డిప్యూటి తహాశీల్దార్ బాలమ్మ,ఏఈ శివకుమార్,పంచాయితీరాజ్ ఏఈ పార్థసారధి, ఇంఛార్జ్ డిప్యూటి ఎంపిడిఓ సాధిక్‌వలి,రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మెన్ సుధాకర్ నాయుడు,పి.యాలేరు సొసైటీ చైర్మెన్ కృష్ణమోహన్ చౌదరి, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌బాబు,ముట్టాల ఎంపిటిసి పారిజాతమ్మ,మాజీ జడ్‌పిటిసి కుళ్లాయప్ప,మాజీ కన్వీనర్ సూరి,మండల ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి,రాప్తాడు నియోజకవర్గ వాల్మీకీ సాధికారత కమిటీ ఈధ్యక్షులు కందుల ఓబుళపతి,హైస్కూల్ కమిటీ చైర్మెన్ మండల బొమ్మయ్య, టిడిపి నాయకులు అక్కులప్ప, రామదాసు, బాబా,పూల ఓబుళపతి,గ్యాస్‌శీనా,కొండా,ఉమాపతి, రవీంద్రరెడ్డి, దొడగట్టు సుధాకర్,మజ్జిగ లత,మజ్జిగ ఆశోక్‌కుమార్, కార్తీక్‌నందన్, అద్దెప్ప, మంగల ఆనంద్,పి.యాలేరు టిడిపి నాయకులు జయశీల, లోకనాథ్‌రెడ్డి, బొమ్మయ్య,ఓబుళపతి,టిడిపి నాయకులు,మండల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సౌదీలో చిత్రహింసలకు గురైన నిజాం 'అనంత'కు రాక

-స్వాగతం పలికిన టిడిపి నాయకులు - ఎమ్మెల్యే దగ్గుపాటి రుణం తీర్చుకోలేమన్న కుటుంబసభ్యులు


నిజాంకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు


సిఎం,డిప్యూటి సిఎం,మంత్రి లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కుటుంబ సభ్యులు

అనంతపురం అక్టోబరు30 ప్రభాతవార్త

నగరంలోని అజాద్‌నగర్‌కు చెందిన నిజాం ఉపాధి కోసం సౌదీకి వెళ్లగా అక్కడ చిత్రహింసలకు గురిచేస్తున్నారన్న వీడియో వైరల్ కావడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కుటుంబ సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు గురువారం అనంతపురంకు నిజాం చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టిడిపి నాయకులు నిజాంను కలిసి స్వాగతం పలికి ఎలాంటి ఆందోళన చెందవద్దని కుటుంబానికి ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా నిజాం కుటుంబ సభ్యులు సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషకం చేస్తూ, ఎమ్మెల్యే దగ్గుపాటి కృషికి తాము ఎల్లపుడూ రుణపడి వుంటామన్నారు. కుటుంబ సభ్యులు ఆందోళనలో వున్నపుడు ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు ఎనలేని కృషి చేసి మా నిజాంను సౌదీ నుంచి అనంతపురంకు రప్పించడం పట్ల స్థానిక టిడిపి నాయకుడు రాయల్ మధుతో పాటు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిజాం కుమారుడికి వైద్య ఖర్చులను కూడా సిఎంఆర్ఎఫ్ ద్వారా ఎమ్మెల్యే అందిస్తాడని టిడిపి యువ నాయకులు సుందర్, దత్తాత్రేయ, టిడిపి నాయకుడు రాయల్‌మధు, మైనార్టీ నాయకుల తదితరులు భరోసా ఇచ్చారు.

పాపంపేట భూవివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేద్దాం
ప్లాస్టిక్ నిషేధానికి 13 ప్రత్యేక బృందాలు
4 >>

01ATP30F_01ATP30F.qxd 30-10-2025 PM 11:33 Page 1

# ప్రజల ప్రాణాలతో చెలగాటం

హిందూపురం టౌన్ అక్టోబర్ 30 ప్రభాతవార్త



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. హిందూపురం మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల కల్తీకల్లు సేవించి దాదాపు 20 మంది దాకా అస్వస్థతకు గురయ్యారని కూటమి ప్రభుత్వం కల్తీ కళ్ళు మద్యం ఏరులై పారిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నాణ్యమైన మద్యాన్ని అందిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు కల్తీకల్లు కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని అన్నారు. హిందూపురంలో కల్తీకల్లు సేవించి అస్వస్థతకు గురైన వారికి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రూరల్ మండల కన్వీనర్ రాము వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూగూరు ఆలయ కమిటీ చైర్మన్‌గా వైసీ చంద్రశేఖర్

హిందూపురం అక్టోబర్ 30 ప్రభాతవార్త



వైసీ చంద్రశేఖర్

హిందూపురం ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన సూగూరు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పాలకమండలి చైర్మన్ గా ప్రముఖ కాంట్రాక్టర్ వైసీ చంద్ర సేకరణ నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దేవాలయం మైదానంలో రాయలసీమలోనే అత్యంత ఎత్తైన ఏకశిలా అభయాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు ను స్వయంగా వైసి చంద్రశేఖర్ భారీ వ్యయ ప్రయాసాలతో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆలయ కమిటీ చైర్మన్ గా నియమితులు కావడంపై పట్టణ ప్రజలు, భక్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# ముగ్గురు నిందితుల అరెస్ట్

## 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

హిందూపురం టౌన్ అక్టోబర్ 30 ప్రభాతవార్త



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హిందూపురం అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను గురువారం హిందూపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్కు తరలించారు. ఈ మేరకు హిందూపురం డిఎస్పి మహేష్ గురువారం అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులలో ఒకరు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడంతో పోలీసులు విచారించి వాహనాల రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించగా నిందితులు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు విషయం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో అప్గ్రేడ్ సీఐ ఆంజనేయులు, రూరల్ సీఐ జనార్ధన్, ఒకటవ పట్టణ సీఐ రాజగోపాల్ నాయుడు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# తహశీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో నిందితులు అరెస్ట్!

కంబదూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త

కంబదూరు తహశీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో నిందితులను కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కొన్ని నెలలపాటు విచారణ చేపట్టిన పోలీసులు తహశీల్దార్ సంతకాన్ని నకిలీగా సృష్టించిన వ్యక్తులను పట్టుకున్నట్లు సమాచారం అందుతోంది. ఈ కేసుకు సంబంధించి కళ్యాణ్ దుర్గం పట్టణ సీఐ హరినాథ్ వివరణ కోరగా అరెస్ట్ చేసింది వాస్తవమేనని రెండు రోజుల్లో పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు.

# శరవేగంగా రోడ్డు పనులు

కుందుర్పి, అక్టోబర్ 30, ప్రభాతవార్త



రోడ్డు పనులు ప్రారంభమైన దృశ్యం

కుందుర్పి నుంచి జంబుగుంపల మీదుగా కొలిమి పాళ్యం వరకు సుమారు 7 కిలో మీటర్ల మేర మట్టి రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. చాలా సంవత్సరాల నుంచి ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేసిన దాఖలాల్లేవు దీంతో కంకర్ తేలి గుంతలతో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ సమస్యను ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో నాబార్డ్ సంస్థ ద్వారా రూ. రెండు కోట్లు మంజూరయ్యేలా ఆయన చర్యలు తీసుకున్నారు. జంబుగుంపల పంచాయతీతో పాటు పరిసర ఐదు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సేవా గుణాన్ని అలవర్చుకొని పర్యావరణాన్ని కాపాడుకుందాం

## నాల్గవరోజు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం రూరల్ అక్టోబర్ 30 ప్రభాతవార్త

రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా సేవకులు 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి దేవాలయం ముందు ఉన్న జెడ్పి హైస్కూల్ ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఫణీంద్ర కుమార్ విచ్చేసి విద్యార్థులకు మన పాఠశాల చుట్టుపక్కల చాలా ఇబ్బందికరంగా ఉండేదని పాములు పురుగులు వచ్చేటువంటి పరిస్థితి విద్యార్థులు కూడా భయపడేటువంటి పరిస్థితి ఉండేది కావున మీరు శుభ్రపరచినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. మరియు విద్యార్థులు భావిభారత పౌరులు మీరు కాబట్టి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తున్నారు, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలలో మీరు పాల్గొనాలని తెలియజేశారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణతో పాసై ఉన్నత చదువులు కూడా పూర్తి చేసుకొని మీ భవిష్యత్తుకు బాట వేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగు అధ్యాపకులు వీరేష్, కామర్స్ అధ్యాపకులు శ్రీనివాసులు, పౌరశాస్త్రధ్యాపకులు వెంకటేశులు, మరియు ఎన్ఎస్ఎస్ పి ఓ ఓబులేష్, పాఠశాల ఇతర ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం జరిగింది.

# ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

## ఏ బిడ్డ జన్మించగానే చనిపోకూడదు .. ఏ తల్లి ప్రసవిస్తూ చనిపోకూడదు -వైద్య సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు ఇచ్చిన జిల్లా వైద్యాధికారి

రాయదుర్గం రూరల్ అక్టోబర్ 30 ప్రభాతవార్త



రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్వో ఈబీ దేవి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ

అనంతపురం జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ ఈ భ్రమరాంబికా దేవి గురువారం రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలు నాణ్యత సిబ్బంది హాజరు ఔషధాల లభ్యత రోగి రికార్డులను మరియు శుభ్రత పరిస్థితులను వివరంగా పరిశీలించారు. అనంతరం రోగుల చికిత్స విధానంపై వైద్య సిబ్బందితో చర్చించి ఈనెల 25వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టీ.విరాపురం గ్రామంలో తులసి అనే గర్భిణీ కళ్యాణదుర్గం ఆర్ డిటి ఆసుపత్రియందు ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కానీ ఆ బిడ్డ చనిపోవడంతో వైద్యులపై బాలింత బంధువులు ఆందోళన చేసిన విషయంపై ఈరోజు విచారణ చేపట్టారు. ఆబాలింతయొక్క రికార్డులుపరిశీలించి ఆరోగ్య పరిస్థితులను రికార్డుల ప్రకారం తెలుసుకున్నారు. ఏ బిడ్డ జన్మించగానే చనిపోకూడదని ఏ తల్లి ప్రసవిస్తూ చనిపోకూడదని వైద్యులకు సిహెచ్ఓ మరియు సూపర్వైజర్లకు ఏఎన్ఎంఆశాకార్యకర్తలకు తీవ్రంగా హెచ్చరించారు. ముఖ్యంగా గర్భవతులు రికార్డులను హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం రోగుల నుండి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తగిన వైద్యసదుపాయాల అందుబాటులో ఉంచి ప్రజలకు సమయానికి సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య సేవలు మరియు అమలు అయ్యే పథకాలు పారదర్శకతగా ఉండాలని సూచించారు. ఈ తరహా లోపాలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. సిబ్బంది నియమ నిబంధనలు పాటించి ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో ఇబి దేవి జిల్లా వైద్యులు త్యాగరాజు డాక్టర్ రాజేంద్రప్రసాద్ డాక్టర్ మాధవ మోహన్ సూపర్వైజర్ సుజాత సిహెచ్ ఓలు స్టాఫ్ నర్సు ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

## ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బ్రహ్మసముద్రం అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన



సమావేశానికి హాజరైన అధికారులు ఎంపిటీసీలు

మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు సర్వసభ్య సమావేశానికి అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు మండల అభివృద్ధిపై ప్రజలకు అవసరమైన సేవలు అందించడం గురించి ప్రాదేశిక సభ్యులకు వివరించారు అధికారులు మాట్లాడుతూ రాయితీలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయిలోని సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు ప్రజలకు వివరించి మండల గ్రామాభివృద్ధికి పాటుపడాలని అన్నారు అనంతరం జడ్పిటిసి ప్రభావతమ్మ మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని మృతి పై ఎంఈఓ ను వివరణ కోరగా ఎంఈఓ ఓబుళపతి మాట్లాడుతూ విద్యార్థిని మృతి పట్ల ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని దానిపైన తగిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపినట్టు చెప్పారు. ఈ సమావేశానికి అధికారులు రాకుండా కింది స్థాయి ఉద్యోగులను పంపడంపై అసహనం వ్యక్తం చేశారు సమావేశానికి హాజరకాన్ని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో డివిజన్ స్థాయి చెస్ పోటీలు

## విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ



డివిజన్ స్థాయి విజేతలతో అధ్యాపకులు, నిర్వాహకులు

కళ్యాణదుర్గం అక్టోబర్ 30 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం డివిజనల్ స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా చెస్ క్రీడను నార్త్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయత్రి, రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరన్న, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్లోనే 11 మండలాల నుంచి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులకు అండర్ 17 అండర్ 14 విభాగాలలో చెస్ పోటీలు నిర్వహించారు. అండర్ 17 విభాగంలో దిలీప్ కార్తీక్ మోక్షేశ్వర్ రెడ్డి మోజేష్ కుమార్ ప్రేమ్చంద్, అండర్ 14 విభాగంలో ఉమేర, సంజన, స్నేహ, తేజస్విని,భాగ్యశ్రీ విజేతలకు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాన్ని గేమ్స్ డివిజనల్ కోఆర్డినేటర్ గోపాల్ రెడ్డి గోపాల్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు సిద్దన్న సుగుణ భాయ్ శివమ్మ కిరణ్ మురళి పని రాజు రాధాకృష్ణ రాజశేఖర్ గోవర్ధన్ తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శైలజ నిర్మల శివన్న మల్లీ రెడ్డి ఓబులరెడ్డి షకీలా తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

గుమ్మఘట్ట అక్టోబర్ 30 ప్రభాత వార్త





"సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించిన వాలంటీర్లు

75 వీరాపురం గ్రామం నందు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వీరాపురం ఉన్నత పాఠశాల యందు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ పాఠశాల విద్యార్థులకు, వాలంటీర్లకు అవగాహన కల్పిస్తూ వర్షాకాలంలో ముఖ్యంగా దోమలు అభివృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ,మెదడువాపు, చికెన్ గున్యామొ" వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతి ఇంటి నుండి వీటిని పాల ద్రోలే పద్ధతులు చేపట్టాలన్నారు. అనంతరం వాలంటీర్లు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలకి చక్కగా వివరించాలన్నారు. అదేవిధంగా పాఠశాల హెడ్మాస్టర్ శాంసన్ గారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరింత ఉత్సాహంతో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించి గ్రామానికి మంచి చేయాలని కోరారు. అనంతరం వాలంటీర్లు మరియు హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు ర్యాలీగా వీధుల్లో తిరుగుతూ ప్రజలకు ఇళ్ళ ముందు ఉన్న నీటి నిల్వలు గురించి వాటి వల్ల సంభవించే వ్యాధుల గురించి వివరిస్తూ కొందరి ఇళ్ళ ముందు పాత డ్రమ్ముల్లోనూ, పాత ప్లాస్టిక్ డబ్బాల్లోనూ నీరు నిలిచి దోమ లార్వాలు విపరీతంగా పెరుగుతున్న దృశ్యాలను చూయించి వాటిని పారబోయించి దోమ వ్యాపించే విధానం పైన, దోమల వ్యాప్తిని అరికట్టే విషయాల పైన అవగాహన కల్పించారు. ఈ మొత్తం కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, మలేరియా వ్యాధి సూపర్వైజర్లు ఎర్రిస్వామి రవిరాజు సూర్యనారాయణ మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హేమలత, కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాబు, గురుమూర్తి, కిరణ్ జక్కల,వినోద్ కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.నారాయణ వాలంటీర్లు, ఉపాధ్యాయులు హనుమంతప్ప, విశ్వనాథ్, మోహన్ బాబు, ప్రశాంత్,సుకుమార్, ప్రభుదాస్ లు పాల్గొన్నారు.

# ప్రతిభ చాటిన విద్యార్థిని లహరి

బెలుగుప్ప, అక్టోబర్ 30 ప్రభాతవార్త



ప్రతిభ చాటిన లహరి

ప్రజా ప్రతినిధుల సభ అయినా అసెంబ్లీ నిర్వహణ, విధివిధానాలు, సభ్యుల పాత్ర, మంత్రుల అధికారాలు, ముఖ్యమంత్రి ఎన్నిక మొదలగు ఎన్నో కార్యక్రమాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఒక విద్యార్థిని ఎంపిక చేయడానికి గత వారం రోజులుగా నిర్వహించిన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పదవ తరగతి విద్యార్థిని లహరి ఉరవకొండ నియోజకవర్గం స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. గుత్తి డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మల్లారెడ్డి, బెలుగుప్ప మండల విద్యాశాఖ హరికృష్ణలు విద్యార్థిని లహరిని అభినందించారు. అలాగే ఆ అమ్మాయిని సిద్ధం చేసిన ప్రధానోపాధ్యాయులను, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణానాయక్‌ని, ఉపాధ్యాయ బృందాన్ని కూడా అభినందించారు.

# మండల స్థాయి అండర్-14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల ఎంపికలు

బెలుగుప్ప, అక్టోబర్ 30 ప్రభాతవార్త



ఎంపికైన క్రీడాకారులు

స్కూల్ గేమ్ ఫెడరేషన్ బెలుగుప్ప మండల స్థాయి అండర్ -14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగవరంలో నిర్వహించారు. మండలంలోని 10 పాఠశాలలు పాల్గొనగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి గుత్తి డివిజనల్ డిప్యూటీ డిఈఓ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి డిఇఓ మాట్లాడుతూ..ఈ పాఠశాలకు విశిష్టమైన చరిత్ర ఉన్నదని, ఇందులో ఏ కార్యక్రమమూ తలపెట్టిన దిగ్విజయంగా పూర్తవుతుందని తెలియజేశారు. చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని ప్రపంచంలో క్రీడాకారులకు అత్యంత ప్రముఖ స్థానం కలిగి ఉన్నారని ప్రస్తుతం ప్రభుత్వం క్రీడాకారులకు మూడు శాతం రిజర్వేషన్ ఇస్తున్నదని అందుకే చదువుతో పాటు క్రీడలలో రాణించి మంచి భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వెంకటరాముడు, వెంకటేష్ వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, తిమ్మరాజు, రాఘవేంద్ర, పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులు శుక్రవారం ఉదయం 9 గంటలకు కెజిసిహెచ్ఎస్, కళ్యాణదుర్గంలో జరిగే డివిజినల్ పోటీలలో పాల్గొంటారు.

# ఉపాధ్యాయుల(UTF)నూతన కార్యవర్గం ఎన్నిక



ఉపాధ్యాయుల బృందం

పరిగి అక్టోబర్ 30 (ప్రభాతవార్త)

మండలం లోని పరిషత్ ప్రాథమిక పాఠశాల,కోడిగేనహళ్లి యందు పరిగి మండలం యుటిఎఫ్ మండల శాఖను ఎన్నుకునే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమం జిల్లా ఆడిట్ కన్వీనర్ మహంతి ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు జిహెచ్ బాబు ఎన్నికల అధికారులుగా విచ్చేయడమైనది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా మరియు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఏ సమస్యలు ఎదురైనా యుటిఎఫ్ తన బాధ్యతగా తీసుకొని సమస్యలను నెరవేర్చడంలో ముందుంటుందని, అలాగే నేడు ఉపాధ్యాయులకు రావలసినటువంటి పీఆర్సి,ఢీ, దీతి తదితర అంశముల విషయంలో వెనకడుగు వేయకుండా రాజీలేని పోరాటం చేస్తుందని తెలియజేయడమైనది . ఈ కార్యక్రమంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు కృపా సత్యరాజ్ లక్ష్మీపతి ఎన్ కే పద్మావతి, జి.ఆర్ శ్రీనివాసులు, శంకర నాయక్ శ్రీనివాసులు, అశ్వత్థ నారాయణ, రంగనాథరాజు, మరియు అధిక సంఖ్యలో యుటిఎఫ్ కార్యవర్గం అందరు కూడా పాల్గొనడం అయినది. అంతేకాకుండా అధ్యయనం అధ్యాపనం సామాజిక స్పృహ లో భాగంగా అనేక సేవా కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకుంటూ ఉందని తెలియ పరిచారు .

# ఎక్సైజ్ శాఖ పరిధిలోని 10 వాహనాల వేలం

బ్రహ్మసముద్రం అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండలం పరిధిలోని ఎక్సైజ్ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడ్డ 10 వాహనాలను అక్టోబర్ 31వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పోలీస్ స్టేషన్ నందు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు వేలంపాటలో పాల్గొన్న తలచిన వారు ధరావత్ రుసుం చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

# మట్టిలో మాణిక్యం సైంటిస్టు డా॥ఎం.భీమలింగప్ప..!

## -బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టు-బిగా నియమితులైన ఎం.భీమలింగప్ప -అంచెలంచెలుగా ఎదిగిన విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురంకు చెందిన వ్యక్తి

ఉరవకొండ, అక్టోబర్ 30 ప్రభాతవార్త



బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టు-బి డా॥ఎం.భీమలింగప్ప



నియామక పత్రాన్ని అధికారుల నుండి అందుకొంటున్న సైంటిస్టు-బి డా॥ఎం.భీమలింగప్ప

మట్టిలో మాణిక్యంకు అన్న సూక్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాడు విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన సైంటిస్టు డా॥ఎం.భీమలింగప్ప. ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల, ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ భారత ప్రభుత్వం పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖకు చెందిన బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాలో (బీఎస్ఐ) సైంటిస్టు-బిగా నియమితులయ్యారు. పోలికి వన్నూరమ్మ, భీమయ్య దంపతుల కుమారుడైన డా॥ఎం.భీమలింగప్ప కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ (యుపీఎస్ఏ)లో జఠిలమైన ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా ఈ ప్రతిష్టాత్మక నియామకం పొందారు. కోల్‌కతాలోని ప్రధాన కార్యాలయం నుండి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆయన అలహాబాద్‌లోని (ఉత్తరప్రదేశ్) సెంట్రల్ రీజినల్ సెంటర్‌లో సైంటిస్టు-బిగా నియమితులయ్యారు. ఏప్రిల్-2022 నుండి 14 అక్టోబర్ 2025 వరకు డా॥ఎం.భీమలింగప్ప కేరళ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (కేఎఫ్ఆర్ఐ) పీచి, త్రిసూర్‌లోని ఫారెస్ట్ బొటనీ విభాగంలో సైంటిస్టు-బిగా పనిచేశారు. 2015 నుంచి 2022 వరకు ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, కె.ఎస్.ఎన్.ప్రభుత్వ మహిళా కళాశాలలో బొటనీ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా సేవలందించారు. అనేకమంది విద్యార్థులలో విజ్ఞానాసక్తిపరిశోధనా దృక్పథం, లక్ష్య సాధనదిశగా బోధనసాగించారు. డా॥ఎం.భీమలింగప్ప అండమాన్ దీవుల్లోని బారటంగ్ దీవి వృక్ష వైవిధ్యంపై ప్రొఫెసర్ బి.రవిప్రసాద్‌రావు మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ట్రీస్ ఆఫ్ బారటంగ్ ఐలాండ్, వెదురు-ప్రకృతి సుస్థిర సంపద ప్రయోజనాలు, సాగు, సామర్థ్యం అనే రెండు పుస్తకాలు రచయితగా, 20 రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురణలతో వృక్షశాస్త్ర రంగానికి విలువైన సేవలు అందించారు.

**నిరంతర శ్రమలో స్వప్నం సాకారమైంది :** నిరంతర శ్రమతో స్వప్నం సాకారమైందని సైంటిస్టు డా॥ఎం.భీమలింగప్ప చెబుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల శ్రమ, గురువులు, స్నేహితుల ప్రోత్సాహం తాను బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టు-బిగా నియమితులవ్వడానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. విద్యార్థులు లక్ష్యం చేరుకోవాలంటే స్థిరమైన ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో కూడిన నిరంతర కృషి అవసరమన్నారు. తాము ప్రయాణించే మార్గంలో ఎంతటి అవరోధాలున్నా వాటినన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగితే విజయం సొంతమవుతుందన్నారు.

# చేనేతలపట్ల వైఎస్సార్‌సీపీ నాయకులది కపటప్రేమ

## -వైఎస్సార్‌సీపీ హయాంలో నష్టపోయిన ఏ ఒక్కరికీ సాయం ఇవ్వలేదు -విలేఖరుల సమావేశంలో మండిపడిన తెలుగుదేశం పార్టీ చేనేత నాయకులు



విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ చేనేత నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 30 ప్రభాతవార్త

చేనేత కార్మికులపట్ల వైఎస్సార్‌సీపీ నాయకులది కపట ప్రేమని తెలుగుదేశం పార్టీ చేనేత నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దకోట్ల రాజేష్, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మల ప్రసాద్, బూత్ కమిటీ కన్వీనర్లు బెస్త రమేష్, నిమ్మల ప్రసాద్, చిట్టా రఘు, పల్లా హరి, దేవి హరి, చిట్టా రామాంజినేయులు, హరికుమార్ విమర్శించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారుమాట్లాడారు. భారీ వర్షాలకు మగ్గం గుంతల్లో నీరు చేరి ఎంత మంది నష్టపోయారో సమగ్ర విచారణ జరిపి జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చేనేత జౌళీశాఖ, రెవెన్యూ అధికారులను ఆదేశించగా విచారణ కూడా పూర్తి అయిందని తెలిసీ చేనేతలపట్ల అపారమైన ప్రేమ ఉన్నట్లు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోవున్న ఐదేళ్ళలో కొందరికి మాత్రమే నేతన్న నేస్తం అందించి ప్రకృతి వైపరీత్యాల కారణంగా చేనేతలు అనేక మార్లు మగ్గాలు పాడై నష్టపోయినా ఎలాంటి సాయం అందించలేదన్నారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీను అమలు చేయలేదన్నారు. రాబోవు రోజుల్లో అర్హుడైన ప్రతి చేనేత కార్మికుడికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయడంతోపాటు ఎన్టీఆర్ నేతన్న భరోసా పథకం కింద 25,000 రూపాయలు, 3 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణం కోసం నిధులను ప్రభుత్వం మంజూరు చేయనుందని పేర్కొన్నారు.

# యర్రగుంటకే పేరు తెచ్చిన విద్యార్థిని హేమలత

## విద్యార్థి హేమలతకి పలువురు అభినందన

కనేకల్లు అక్టోబర్ 30 ప్రభాతవార్త



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజ్యాంగం దినోత్సవాల్లో సంబరాల్లో భాగంగా రాయదుర్గం నియోజకవర్గం ఈనెల 29న 5 మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాజ్యాంగం మీద వ్యాసరచన వకృత్వ విజ్ఞ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కనేకల్లు మండలం యర్రగుంట గ్రామం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని హేమలత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన హేమలతను వారి తల్లిదండ్రులను అమరావతిలో నవంబర్ 26న జరిగే విద్యార్థి మాకు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడానికి ప్రభుత్వమే విద్యార్థినికి వారి తల్లిదండ్రులకు అన్ని ఖర్చులు భరిస్తూ అసెంబ్లీలో పాల్గొనడానికి అవకాశం కల్పించింది . ఈ సందర్భంగా విద్యార్థి హేమలతని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి రాజశేఖర్ ఆధ్వర్యంలో పోటీల్లో గెలుపొంది అసెంబ్లీలో పాల్గొనడానికి అవకాశం సంపాదించుకున్న హేమలతను శాలువా కప్పి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ మాట్లాడుతూ హేమలత ఎంతో తెలివితేటలతో చదువు మీద ఆసక్తితో ఆటల్లోనే కూడా ప్రతిభ కనపరిచింది అన్నారు. ఎర్రగుంట గ్రామానికి విద్యార్థిని పేరు తెచ్చింది అన్నారు ఈ అమ్మాయి ఇలాగే కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత స్థాయిని అందుకోగలదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## 13న బ్రాహ్మణుల మెగా జాబ్ మేళా
### - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల చేతి మీదుగా బ్రోచర్స్ విడుదల


బ్రౌచర్లను విడుదల చేస్తున్న రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్

అనంతపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త బ్యూరో
డిసెంబర్ 13వ తారీఖున గుంటూరులో నిర్వహించేటువంటి మెగా జాబు మేళ బ్రోచర్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ చేతులు మీదుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలోని బిజెపి కార్యా లయంలో విడుదల చేశా రు. ఈ సందర్బంగా ఆయన మాట్లా డుతూ.. రాష్ట్రంలోని నలుమూలలో ఉన్నటువంటి నిరుద్యోగ బ్రాహ్మణ యువతీ యువకులకు ఇది ఒక గొప్ప అవకాశం అని ఈ మెగా జాబు మేళా ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ గౌరవనీయులు ఆలూరు లక్ష్మినర సింహ శాస్త్రి, జిల్లా అధ్యక్షులు సి.వి మురళీధర్, ప్రధాన కార్యదర్శికరణం రామ సుబ్బా రావు, నార్పల మారుతి నరసింహం, కొనకంచి మురళి రాష్ట్ర మహిళా విభాగం దాక్షాయిని, సంకేపల్లి సత్యనారాయణ శర్మ, ఏసిఎస్ ప్రసాద్ రిటైర్డ్ డిఎస్పి శేషశయనం పోలేపల్లి నాగభూషణం, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగజ్యోతి దుర్గ, లక్ష్మినరసమ్మ, కరణం చంద్రకాంత్, సంపత్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మెగా జాబు మేళాను రాష్ట్రంలోని అన్ని జిల్లాలు అన్ని తాలూకాలలో ఉన్నటువంటి బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు.

## విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి స్వదేశీ ఉత్పత్తులను వాడండి
### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపు
### పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం

అనంతపురం : అక్టోబర్ 30 (ప్రభాతవార్త బ్యూరో)
విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి స్వదేశీ ఉత్పత్తులను వాడడం అలవాటు చేసుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు.పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మ నిర్బార్ భారత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. పీవీకేకే కళాశాలకు విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కళాశాల చైర్మన్ కిషోర్ రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్పగుచ్చం అందించి అపూర్వ స్వాగతం పలికారు. అనంతపురం శివారు ప్రాంతంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన ఆత్మ నిర్బార్ భారత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర నాయకులు చిరంజీవి రెడ్డి, వంశీ హాజరయ్యారు. పివి కేకే ఇంజనీరింగ్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ, ఆత్మ నిర్బార్ భారత్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంకల్పం అన్నారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి స్వదేశీ ఉత్పత్తుల వాడకాన్ని పెంచుకోవాలని సూచించారు. స్థానికంగా మనం ఉత్పత్తి చేసే పంటలు వస్తువులు వాటిని వాడాలని పేర్కొన్నారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం అన్ని మతాలను ,కులాలను సమానత్వంగా గౌరవిస్తోందని పేర్కొన్నారు. భారత్ ప్రజాస్వామ్య చేసామన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం ఏదైనా ఉందంటే అందుకు భారతదేశమే ప్రత్యేక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శరత్ కుమార్ రెడ్డి, వంశీధర్, అనంతపురం జిల్లా బిజెపి నాయకులు లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## ఇక మీదట సిపి బ్రౌన్ జయంతి రాష్ట్ర పండుగ

అనంతపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్తబ్యూరో
తెలుగు సూర్యుడుగా పేరుపొందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి పి బ్రౌన్) జయంతిని ఈ ఏడాది నుండి ప్రతి నవంబర్ 10 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విమలా శాంతి సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ, ఉమ్మిడిశెట్టి సాహితీ ట్రస్ట్, అనంతపురం జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, స్పందనకి అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి, కవి సమ్మేళనం, మహాబోధి, వేమన విజ్ఞాన కేంద్రం, సాహిత్య భారతి, తెలుగు వెలుగు, తెలుగు భాషా పరిరక్షణ వేదిక, గుర్రం జాషువ సాహిత్య పీఠం మొదలైన సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీష్ తెలుగు నిఘంటువులు రచించి, వేమన పద్యాలను తొలిసా రిగా వెలుగులోకి తెచ్చారు బ్రౌన్. కడపలో ఇప్పుడు ఉన్న సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఒకనాడు బ్రౌన్ నివసించిన స్థలం. ఆంగ్లేయుడు అయిన బ్రౌన్ తెలుగు భాష నేర్చుకొని, ప్రాచీన తెలుగు గ్రంథాల రాత సేకరించి, సొంత జీతంలోంచి పండితులకు జీతాలిచ్చి, తాళపత్ర గ్రంథాలను పరిష్కరిం పజేసి, ప్రచురించిన గొప్ప వ్యక్తి సిపి బ్రౌన్.1784లో పుట్టి, 1878లో మరణించిన బ్రౌన్ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం ఎంతైనా ప్రశంసనీయమని భాషా సాహిత్యవేత్తలు మెచ్చుకున్నారు. అనంతపురంలో సిపి బ్రౌన్ విగ్రహాన్ని నెలకొల్పాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## సైన్స్‌లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ఢిల్లీలో జరిగే సైన్స్ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం


పి.గీతరెడ్డి (హనకనహాళ్)


సాయిశ్రీదీప్తి (రాయదుర్గం)

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త
సైన్స్ లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ఢిల్లీలో జరిగే సైన్స్ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం జిల్లా విద్యాశాఖ కల్పిం చింది. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండి ఇద్దరు విద్యార్థులకు నవంబర్ 6 నుండి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే సైన్స్ కార్యక్రమాల్లో పాల్గొన్న అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. మన జిల్లా నుండి హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గీతారెడ్డి, రాయదుర్గం శ్రీ సాయి దీప్తిలను వారికి సైన్స్ పట్ల ఉన్న ఆసక్తి, వివిధ సైన్స్ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్న నేపథ్యం పరిగణలోకి తీసుకొని ఎంపిక చేయడం జరిగింది. వీరు నవంబర్ 4వ తేదీన విజయ వాడకు బయలుదేరి వెళ్లాల్సి ఉందని జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త శైలజ విద్యార్థుల్ని అభినందించారు. వీరు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రముఖ సైన్స్ కేంద్రాలను, సైన్స్ మ్యూజి యంలను, రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్, నెహ్రూ ప్లానిటోరియం లాంటి ప్రముఖ విజ్ఞాన ప్రదేశాలను వీరు వీక్షించడం జరుగుతుంది. అదేవిధంగా నాసా కేంద్రంలో పనిచేస్తున్న ప్రముఖ ఇంజనీ ర్‌తో ముఖాముఖి చర్చలో కూడా పాల్గొని అవకాశం కలుగుతుంది. ఈ అవకాశాన్ని కలిగించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపా ధ్యాయులు జిల్లా విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజి మంత్రి ఉషశ్రీచరణ్‌కి వివాహ పత్రిక అందజేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్ కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త
తన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కూతురి వివాహానికి రావాల ంటూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సిపి శ్రీసత్య సాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ను రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆహ్వానించారు. గురువారం ఆమెను కలిసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వివాహ ఆహ్వానపత్రిక అందజేశారు. కుటుంబ సమేతంగా హాజరై నూ తన వధూవరులను ఆశీర్వది ంచాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు.

## పాపంపేట సోత్రం భూముల్లో అక్రమ జిపిఎలను రద్దు చేసి అక్రమ జిపిఎలను చేసిన సబ్ రిజిస్టర్‌ని సస్పెండ్ చేయాలి - సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి


నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి తదితరులు

అనంతపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త బ్యూరో
పాపంపేట సోత్రం భూముల్లో అక్రమంగా ఎలాంటి హక్కు లేకపోయినా కొంతమంది అక్రమ భూకబ్జాదారులు జిపిఏ చేయించుకుని 50 సంవత్సరాల నుంచి నివసిస్తున్న పాపంపేట గ్రామ ప్రజలను భయాంత్రులుగా గురిచేసి ఖాళీ స్థలాల్లోబోర్డులు నాటి ఆక్రమించుకోవాలని చూస్తున్నరని జిపిఎ రద్దుచేసి దీనికి బాధ్యులైన సబ్ రిజిస్టర్ ని సస్పెండ్ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా రిజిస్టర్ ఆఫీస్ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి. నారాయణస్వామి, సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున జే.రాజారెడ్డి హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ అనేకమంది పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు ఉద్యోగ ఉపాధ్యాయులు తమ కష్టార్జితంతో హక్కుదా రులతో భూములు కొనుగోలు చేసి 50 సంవత్సరాల నుంచి నివాసం ఉంటు ఉన్నారని, అలాగే కొంతమంది భవిష్యత్తు అవసరాల కోసం స్థలాలు కొన్ని పెట్టుకున్నారు. 70 సంవత్సరాల తర్వాత కొంతమంది ఈ భూమి మాది అని ఈ భూమిని ముగ్గురు వ్యక్తుల పైన జిపిఎ చేయించి వారి ద్వారా ఈ భూములను ఆక్రమిం చుకోవాలని ఒక దుష్ట ఆలోచనతో ప్రయత్నం చేస్తూ కోట్లు విలువచేసే ప్రజల ఆస్తులపై దౌర్జన్యం చేస్తూ బోర్డు నాటుతూ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇప్పటికే వీటిపై అనేక సందర్భాల్లో అధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరు స్పందించలేదు దీనికి బాధ్యులైన రెవిన్యూ అధికారులు కానీ సబ్ రిజిస్టర్ అధికారులు కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు ఇప్పుడు బాధ్యతలు తమ ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన వారే తమ ఆస్తుల్ని లాగేసుకుని ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు కాబట్టి ప్రజలు పాపంపేటలో నివసిస్తున్న ప్రజానీకానికి అందంగా అండగా ఉండాల్సిన అవసరం ఉంది వారి కోసం నిలబడాల్సిన అవసరం ఉంది కాబట్టి దీనికి బాధ్యులైన అక్రమ జిపిఎలను రద్దుచేసి ఇందుకు బాధ్యులైన అధికారులను డిస్మిస్ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బాధితులు పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ పాపంపేట భూ బాధితుల కోసం సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ శాసనస భ్యులు రామకృష్ణ రేపటి రోజున పాపంపేటలో బాధితులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారని దీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య దర్శి వర్గం సభ్యులు శ్రీరాములు, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమే ష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమణయ్య, లింగమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి వికె కృష్ణుడు, అనంతపురం సిపిఐ మండల సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, రాప్తాడు మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు అశోక్, సిపిఐ నాయకులు అలిపిర, రామాంజ నేయులు, చాంద్ బాషా, ప్రసాదు, కుల్లయప్ప, రాజు, ఎల్లుట్ల నారాయణ స్వామి, మున్నా, మహిళా సంఘం నాయకురాలు జానకి, పాపంపేట భూ పరిరక్షణ నాయకులు గోపాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాపంపేట వివాదంలో మంత్రి పయ్యావుల కేశవ్ ఎందుకు మాట్లాడలేదు
### - సిపిఎం నేత రాంభూపాల్ డిమాండ్


నిరసనలు వ్యక్తం చేస్తున్న సిపిఐ నేత రాంభూపాల్, నాయకులు, భూ బాధితులు


మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం నేత రాంభూపాల్

అనంతపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త బ్యూరో
అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో శోత్రియం భూముల వివా దంలో రాజకీయ నాయకులకు పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణ సంకటం అన్న విధంగా తయారైందని సిపిఎం నేత రాంభూపాల్ పేర్కొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ ఈ వివాదంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పాపంపేట బాధితులను భూకబ్జా దారుల నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ వద్ద సీఎం నాయ కులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. శోత్రియం భూముల కబ్జాదారుల నుంచి పాపంపేట వాసులను కాపాడాలని వారికి భద్రత కల్పించాలని డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా సిపిఎం నేత రాంభూపాల్ మాట్లాడుతూ.. మొత్తం 932 ఎకరాల్లో ఉన్న శోత్రియం భూముల వ్యవహా రంలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 15వేల కుటుం బాలను రోడ్డుకు ఈడ్చి వేల కోట్లు సంపాదిద్దా మన్న ఆలోచన వెనుక రాజకీయ నాయకుల కుట్రలు ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్న వారు, ప్రతిపక్షంలో ఉన్నవారు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ఈ వివాదాన్ని మరింత దూరం తీసుకెళ్తున్నారన్నారు. దీనిపై ప్రజలు పెద్ద ఎత్తున గగ్గోలు పెడుతున్నా జిల్లాలో ఉన్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఎందుకు దీని గురించి మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వేల మందికి సంబంధించిన విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటున్నారని ప్రశ్నిం చారు. వెంటనే ఇక్కడ భూకబ్జాదారుల నుంచి పాపంపేట వాసులను కాపాడాలని వారికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎంఈఓ-2 సస్పెన్షన్‌ను ఖండిస్తున్నాం - ప్రజా సంఘాల నాయకులు


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త
గుమ్మగట్ట ఎంఈఓ2 రామచంద్ర తన అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ తన భర్త సహాయంతో ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ఏకపక్ష నిర్ణయంతో సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము అని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖలో రిజర్వేషన్ వర్గాలకు రావాల్సినటువంటి ప్రయోజనాలను నిరంతరం ప్రశ్నిస్తున్న ఎంఈఓ-2ను ఏపీసీ అగ్రకుల ఆహంభావంతో తన ప్రభుత్వం ఉందని, జిల్లాలో ఉన్న దళిత ఆఫీసర్ మీద కుల వివక్ష ,కక్షగట్టి, ఎప్పుడో మూడు సంవత్సరాల కిందట జరిగిన పనులలో తప్పు జరిగిందని, తన బంధువు అయిన డిఈ జయరాం నాయుడుతో ఏకపక్షంగా ఒక ఫేక్ రిపోర్టు ను తయారు చేయించి, దాని మీద వివరణ అడగడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దళిత ఆఫీసర్లను టార్గెట్ చేస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ రామచంద్ర సమక్షంలో జరిగిన పనిని జరగలేదని ఆయనను పిలవకుండా, ఒక రిపోర్ట్ ఆధారంగా చేసుకొని రామచంద్ర పని చేసినటు వంటి స్కూల్ రికార్డులను, ఓచర్లు, పేరెంట్స్ కమిటీ తీర్మానాలు ఇచ్చి, ఆర్జేడీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు మూడు రోజులు గడువు ఇవ్వడం వలన స్పష్టమైన ఆధారాలతో, ఎలాంటి తప్పు చేయలేదని సమాధానం ఇచ్చే లోపు ఏకపక్షంగా, కుట్రపూరితంగా కొందరు అవినీతి అధికారులను ప్రశ్నిస్తున్నాడనే భావనతో ఎంఈఓ-2ను వివరణ తీసుకోకుండా, అక్రమంగా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. రామచంద్రపై మోపిన నిరాధారమైన ఆరోపణలను ప్రజా సంఘాలుగా తాము ఖండిస్తున్నామన్నారు. ఆయన సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోకపోతే జిల్లావ్యా ప్తంగా ఉద్యమాలు చేస్తామని ప్రజా సంఘాలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి. రమణ, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేష న్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి నాగభూషణం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వలిగొండ రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ముత్యాలరాజు, రాయలసీమ అధ్యక్షుడు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి వినోద్, అధ్యక్షుడు కోటి మల్లేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణస్వామి, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాకలి శ్రీరాము లు, జై భీమ్ సేన రాష్ట్ర అధ్య క్షుడు రామాంజనేయులు, మాది గ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే రామ తీర్థ, జూటూరు రామాంజ నేయులు, నారాయణ స్వామి, నల్లప్ప, సుబ్రహ్మణ్యం, బిసి పరిరక్షణ సమితి బీసీ నాయకులు సాకే నరేష్, లాయరు గుజ్జుల పోతులయ్య, మాదిగ దండోరా అధ్యక్షుడు చిన్న పెద్దన్న, లౌకిక రాజ్య పరిరక్షణ సమితి మండల రమేష్, నిర్వాసితుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాయినేని నాగేంద్ర ప్రసాద్, ప్రజా ఉద్యమాల ఐక్య వేదిక కో ఆర్డినేటర్ డా.ముచ్చుకోట సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మీ ఎంపీటీసీని మీరే కాపాడుకోలేరు... పార్టీని ఏమి కాపాడుతారు
### కూటమి ప్రభుత్వం పై నిందలు వేయడం సరైయిందికాదు ఎంపీపీ


మాట్లడుతున్న ఎంపీపీ దాసరి సునీత

బుక్కరాయసముద్రం అక్టోబర్ 30 ప్రభాతవార్త
వైకాపా ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టేముందు వారి అభిప్రాయాలు తెలుసుకోకుండ అవిశ్వాసం పెట్టాలని సంబందిత అధికారులకు నోటీలు ఇచ్చారు. నోటీలు ఇచ్చేందుకు పోయినప్పుడు వైకాపా ఎంపీటీసీలే మాకు ఫోన్ చేసి మాతో బలవంతంగా సంతకాలు పెట్టిచ్చారని మాకు తెలియజేశారు.మా మద్దతు మీకే ఇస్తామన్నారు.ఎవరిని బలవంతంగా ఒప్పించడంలేదు మీ ఎంపీటీసీని మీరే కాపాడుకోలేరు ఇక పార్టీని ఏమి కాపాడుతామని ఎంపీపీ దాసరి సునీత అన్నారు.గురువారం ఎంపీపీ దాసరి సునీత నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్బంగ వారు మాట్లడుతూ అవి శ్వాస తీర్మాణంలో అవిశ్వాసం విఫలమైయింది అభివృద్ధి గెలిచిందని కూటమి ప్రభుత్వంలో జరుగుచున్న అభివృద్దిని చూసి ప్రజల మద్దతుతో ముందుకు పోతా ఉంటే వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంను విమ ర్శించడం మంచిపద్దతికాదు,
గతంలో నేను వైసీపీలో ఉన్న సమయంలో ఎంపీపీ పదవి ఇవ్వడానికి అప్పటి ఎమ్మెల్యేలు నాదగ్గర డబ్బులు తీసుకొని నాకు ఈ పదవి ఇచ్చారు.రెండు సంవత్సరాల తరువాత నన్ను చాలా ఇబ్బందులు పెట్టారు, మండలంలో తిరగద్దు అని శాసించారు.సమావేశాలకు పోతే గౌరవించేవారు కాదు వాటిని అన్నితట్టుకొని ఎంపీగా నా భాధ్యతలు నిర్వర్థిం చినాను, వైకా పాలో కొనసాగి ంటే నేను ఆత్మ హత్యచేసు కొనేదాన్ని,అం దుకే 20 24 ఎన్ని కల ముందు నా సేవలను గుర్తించి టిడిపిలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌క ళ్యాన్ ,ఐటి శాఖ మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ,ఎంపి అంబికా లక్ష్మినారాయణ, సహకా రాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వల సంక్షేమ పథకాలతో ప్రజలకు సంక్షేమ పథకాలను అంది స్తున్నామ న్నారు.అభివృద్దిని చూసి వైకాపా నాయకులు అడ్డుకట్టవేశారు .ఇప్పటికి వైకా పా ఎంపీ టీసీలు మా ఎమ్మెలే బండారు శ్రావణిశ్రీకి అందు బాటులో ఉన్నారు.కూటమి ప్రభుత్వంను విమర్శి స్తే తగిన మూల్యం చెల్లిం చుకోవాల్సివస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకలు బుల్లే నారాయ ణస్వామి,టిడిపి అధికార ప్రతినిధి ఓబులపతి, నీలారెడ్డిపల్లి గంగాదర్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా వుండే ఏకైక పార్టీ టిడిపి
### -రూ.100లతో రూ.5లక్షలు బీమా - దేశంలో ఏ నాయకుడు నారా లోకేష్‌లా అలోచించలేదన్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ప్రమాద బీమా పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అక్టోబరు30 ప్రభాతవార్త
.ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా వుండే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, కేవలం రూ.100లతో రూ.5లక్షలు ప్రమాద బీమా కల్పిస్తూ, దేశంలో ఏ నాయకుడు నారా లోకేష్‌లో ఆలోచించలేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నాడు. స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో 12వ డివిజన్‌కు చెందిన మదన్‌మోహన్ ఆచారి మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం వుండడం వల్ల మృతుని కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా పత్రాన్ని ఆయన అందజేశాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్, ఎమ్మెల్యే దగ్గుపాటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ మదన్‌మోహన్ ఆచారి మృతి బాధాకరమని, దురదృష్టవశాత్తు ఎవరైనా కార్యకర్త చనిపోతే కేవలం రూ100 లు చెల్లించి సభ్యత్వం తీసు కున్న ప్రతి ఒక్కరికి రూ.5లక్షల బీమా తెలుగుదేశం పార్టీ అందజేస్తోందన్నాడు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయరాం నాయు డు, కార్పొరేటర్లు బాలాంజి నేయు లు, జనబలం బాబా, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి నాయకులు రాయల్ మధు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి లేఔట్ క్రమబద్ధీకరించాలి
### -గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలి - అధికారులకు అహుడ చైర్మన్ టిసి వరుణ్ ఆదేశం

అనంతపురం అక్టోబరు30 ప్రభాతవార్త
అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(అహుడ) పరిధిలోని ప్రతి లేఔట్ క్రమద్దీకరణ కావాలని అహుడ చైర్మన్ టిసి.వరుణ్ అధికారులను ఆదేశించాడు. స్థానిక అహుడ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు ఫిర్యాదులు వచ్చాయని తక్షణం వాటిని అధికారులు పరిష్కరించాలన్నాడు. అహుడ పరిధి విస్తృతమౌడం వల్ల ప్రతి గురువారం కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించి ప్రజలకు ఎలాంటి సమస్యలు వున్నా పరిష్కరించడానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చాడు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ అహుడ పరిధిలోని ఎన్టీఆర్ టౌన్‌షిప్, ఎంజిజి లేఔట్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నాడు. ప్రతి ప్లాట్ కొనుగోలుదారుడికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మౌళికవసుతులు కల్పించాలన్నాడు. అలాగే ఎక్కడైనా అక్రమలేఔట్లు వేస్తే కఠినచర్యలు తీసుకోవాలన్నాడు. అహుడ ఆధ్వర్యంలో నగరంలో పింక్ టాయిలెట్స్ నిర్మించేందుకు పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించాడు. ఈ కార్య క్రమంలో అహుడ వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సెక్రటరి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుష్యంత్, డిఈ రేవంత్,జెపిఒ హరీష్ చౌదరి, పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలి
### కస్తూరిభాగాంధీ బాలికల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పరిటాల సునీత


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


ఎమ్మెల్యే సునీతకు పుష్పగుచ్చం అందిస్తున్న కస్తూరిభా గాంధీ పాఠశాల కమిటీ చైర్మెన్ మజ్జిగ లత,టిడిపి నాయకులు

ఆత్మకూరు ఆక్టోబర్ 30 ప్రభాతవార్త
పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని విద్యార్థులకు రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.గురువారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో 18.50 లక్షల ఎస్ఎస్ఏ నిధులతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థినిలతో కలిసి ప్రారంభించారు.మెదటగా పాఠశాల విద్యార్థులు,నాయకులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఘన స్వాగతం పలికారు.పూజా కార్యక్రమాలు అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి,విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు.విద్యార్థుల ప్రతిభను చూసి ప్రసంశించారు. రూ, 1.25 కోట్లు ఎస్ఎస్ఏ నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి భవనాలను పరిశీలిం చారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వచ్చిన తర్వాత విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చా యన్నా రు.ప్రాథమిక స్థాయి నుంచే టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన పెంపొం దించే విధంగా అనేక మార్పులు చేస్తున్నారని తెలిపారు.ఎప్పుడు లేని విధంగా ప్రభుత్వం విద్యా కోసం భారీగా ఖర్చు చేస్తున్నారని,కావున విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యార్థులు సెల్‌ఫోన్లుకు దూర ంగా ఉండాలని,ఉపాధ్యాయులు సూచించే విజ్ఞానం వైపు అడుగులు వేయా లని,టెక్నాలజీకి దగ్గరగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత విద్యా ర్థులకు సూచించారు.నూతన భవనాన్ని నాణ్యతతో నిర్మించిన కాంట్రాక్టర్ మజ్జిగ ఆ శోక్‌ను ఎమ్మెల్యే అభినందించినది.ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌చౌదరి,పి.యాలేరు సొసైటీ అధ్యక్షుడు కృష్ణమోహన్ చౌదరి,కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల చైర్మెన్ మజ్జిగ లత,నియోజకవర్గ వాల్మీకీ సాధికారత కమిటీ అధ్యక్షులు కందుల ఓబుళ పతి,టిడిపి నాయకులు అక్కులప్ప,రామదాసు ,అశోక్,రవీంద్రరెడ్డి, బోయ సుధాకర్,విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో స్మార్ట్‌స్ట్రీట్ మార్కెట్లు, తృప్తి క్యాంటీన్లు
### -మహిళలు పథకాలపై అవగాహన కల్పించాలి
### -మెప్మా అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


మెప్మా అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త
నగరంలో స్మార్ట్‌స్ట్రీట్ మార్కెట్లుతో పాటు తృప్తి కా ్యంటీన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మెప్మా అధికారులకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అదేశించాడు. క్యాంప్ కార్యాలయంలో గురువారం మెప్మా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ప్రధానంగా మహిళల కు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలి ంచా లన్నాడు. పిఎం సూర్యఘర్, మహిళా సంఘాల రుణాలపై సమీక్షిస్తూ స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ల నిర్వహణకు ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేశారని, దీనిపై అవగాహన కల్పించారా..అంటూ ప్రశ్నించాడు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెం దాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 750 క్యాంటీన్లను ప్రారంభించాలని లక్ష్యం కాగా అనంతపురంలో ఎన్ని ఏర్పాటు చేస్తారని, తక్షణం ప్రణాళికను సిద్ధం చేయాలన్నాడు. అలాగే పిఎం సూర్యఘర్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీలపై ప్రచారం ముమ్మరం చేయాలని, అలాగే మహిళలకు నగరంలో అధిక రుణాలు అందించేలా చర్య లు తీసుకోవాలని, ఇందుకోసం బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించే ందుకు చర్యలు తీసుకో వాలని ఎమ్మెల్యే, మెప్మా అధికారులకు ఆదేశించాడు. ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వజ్యోతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ కోసం యువత పాటు పడాలి - ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ






పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త
అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) జాతీయ సేవ పథకం బృందం ఆధ్వర్యంలో నిర్వహించే స్పెషల్ క్యాంప్ కురుగుంట గ్రామంలో మూడవరోజు విజయవంతంగా నిర్వహించినట్లు ఎన్.ఎస్.ఎస్ యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మశ్రీ వైస్ ప్రిన్సిపాల్ డి.సహదేవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకం స్పెషల్ క్యాంపులో భాగంగా విద్యార్థులు ఈరోజు గురుగుంట గ్రామంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఉపాధ్యాయులు నాగార్జున, శ్రీకరం, కేశవులు, క్షమాభారతి, వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుల సుంకర రమేష్, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటీర్ మహేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూడికను ఎప్పటికపుడు తొలగించడి
### -చెత్తసేకరణ పక్కాగా సేకరించాలి-కమిషనర్ బాలస్వామి


అన్నా క్యాంటీన్‌లో అల్పాహార నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం, అక్టోబరు30 ప్రభాతవార్త
మురికికాల్వలో పూడికను ఎప్పటికపుడు తొలగిస్తూ మురికినీరు సజావుగా ప్రవహించాలని, ఇంటింటి చెత్తసేకరణ పక్కాగా సేకరించి తరలించాలని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారులకు ఆదేశించాడు. సాధారణ పర్యవేక్షణంలో భాగంగా గురు వారం ఆయన టవర్ క్లాక్, కమలానగర్, పోలీస్‌కాంప్లెక్స్, నడిమి వంక, బళ్లారి బైపాస్‌రోడ్డు, కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డు, రామ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల ను పర్యవేక్షించాడు. ఈ సందర్భంగా సంబంధిత శానిటేషన్ అధికారులతో మాట్లాడుతూ సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణ కోసం నిరంతరం ప్రత్యేక దృష్టి సారించాలన్నాడు. అనంతరం బళ్లారి రోడ్డులోని అన్నా క్యాంటీన్ సందర్శించి, పరిసరప్రాంతం పరి శుభ్రత, ప్రజలు అందించే అల్పా హార నాణ్యతను పరిశీలించాడు.

**CHANGE OF NAME**
I, TOTLE PALLI SHAIK RAJIVULLA (Old Name) Residing Door No.3/3338-10A, Nallagutta Street, Kadiri Town, Sri Satya Sai District, AP-515591, Change Of My Name as TOTLE PALLI SHAIK RAJIVULLA (Old Name) to **THOTLAPALLI SHAIK RAZIULLA** (New Name) Hence Forth My Name Being Called as **THOTLAPALLI SHAIK RAZIULLA** For All Purposes. S/o THOTLAPALLI SHAIK ALI SAB.

**CHANGE OF NAME**
I, TOTLEPALLI SHAIK FAIROZA (Old Name) Residing Door No.3/3338-10A, Nallagutta Street, Kadiri Town, Sri Satya Sai District, AP-515591, Change Of My Name as TOTLEPALLI SHAIK FAIROZA (Old Name) to **THOTLAPALLI SHAIK FAIROZA** (New Name) Hence Forth My Name Being Called as **THOTLAPALLI SHAIK FAIROZA** For All Purposes. W/o THOTLAPALLI SHAIK RAZIULLA.

